క్లుప్తంగా

ఉపాధ్యాయుడికి అవార్డు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కు మార్ మదర్ థెరిసా జాతీయ సేవా పురస్కారం వరించింది. దీనిని విజయవాడలోని అక్కినేని కళా కేంద్రంలో మదర్ సర్వీసెస్ సొసైటీ మూడో వార్షికోత్సవం సందర్భంగా సోమవారం సినీ నటుడు పృథ్వీరాజ్, నటి రజిత చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహులు

పొదలకూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తక్కువ ప్రీమియం కలిగిన బీమా యోజన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పొదలకూరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ డి.లక్ష్మీనరసింహులు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ బీమా పథకాలపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పీఎం జీవనజ్యోతి బీమా యోజన, పీఎం సురక్ష బీమా యోజన, అటల్ పింఛన్ యోజన పథకాలను అమలు చేస్తున్నట్టు వెల్లడించారు. పొదలకూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఏటీఎం మోసాలు అధికంగా జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏటీఎం సెంటర్ల వద్ద అపరిచితులకు కార్డులను అందజేసి నగదు తీసివ్వాలని కోరవద్దన్నారు.

కూచిపూడి పోటీల్లో ప్రతిభ



పూర్ణిమను సన్మానిస్తున్న హెచ్‌ఎం

మనుబోలు: మండలంలోని మనుబోలు జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న పృథ్వీ పూర్ణిమను సోమవారం హెచ్‌ఎం వసంతకుమారి, అధ్యాపకులు సన్మానించారు. ఇందుకూరుపేట మండలంలో జరిగిన కూచిపూడి పోటీల్లో పూర్ణిమ ప్రతిభ చూపారు.

కొమ్మల కత్తిరింపుతో అధిక దిగుబడులు

సైదాపురం: మామిడి రైతులు, కొమ్మల కత్తిరింపుతో మంచి పంట దిగుబడులు సాధించవచ్చని పొదలకూరు ఉద్యానవన శాఖాధికారి ఆనంద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పండ్ల తోటల రైతులు ఉద్యాన శాఖాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే దీర్ఘకాలికంగా తోటలు పెరిగి మంచి పంట దిగుబడులతో లాభం పొందవచ్చన్నారు. చెట్లు గుబురుగా ఉండటంతో గాలి, వెలుతురు, సూర్యరశ్మి తగలక పంట సరిగా రాదన్నారు. ప్రతి ఏడాది జూలై – సెప్టెంబర్ మధ్య కాలంలో గుబురుగా ఉన్న చెట్ల కొమ్మల కత్తిరించాలని సూచించారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన విద్యార్థి

నెల్లూరు సిటీ: రూరల్ తహసీల్దార్ కృష్ణప్రసాద్ సమక్షంలో తప్పిపోయిన విద్యార్థి సాయిని సోమవారం తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని కావేరి నగర్‌కు చెందిన రాము కుమారుడు ఎం.సాయి గూడూరులోని ఎస్సార్కే కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. ఆ సమయంలో స్నేహితుల ద్వారా శ్రీకాళహస్తి వెళ్లి హిజ్రాలతో పరిచయం పెంచుకున్నాడు. ఈ క్రమంలో గత నెల ఆగస్టు 14న ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. దీంతో అతని తండ్రి జిల్లా బాలల సంరక్షణాధికారి బి.సురేష్‌ను సంప్రదించారు. వెంటనే ఆయన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం ఇచ్చి మిస్సింగ్ కేసు నమోదు చేయించారు. విచారణలో పోలీసులు గూడూరులో హిజ్రాల వద్ద సాయిని గుర్తించారు. అనంతరం నెల్లూరుకు తరలించారు. రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో సాయిని తల్లిదండ్రులకు అధికారికంగా అప్పగించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ బాలల భద్రత కోసం తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

జాషువా కవిత్వంపై ఉపన్యాసం రేపు

నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలోని వర్తమాన సమాజం హాల్లో చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు 'గుర్రం జాషువా కవిత్వం.. మానవీయ దృక్కోణం' అంశంపై ఉపన్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ వేదిక నిర్వాహకుడు వై.శేష గిరీశం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వక్తగా తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ తెలుగు అధ్యయన శాఖ నిర్వాహకుడు డాక్టర్ బ్రహ్మానందరెడ్డి వ్యవహరిస్తారన్నారు.

పట్టాలిస్తే పక్కాగృహాలు నిర్మించుకుంటాం



తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న టపాతోపు గిరిజనులు

కొడవలూరు: ఎన్నో ఏళ్లుగా టపాతోపులో పాకలు వేసుకొని నివాసముంటున్నామని, మాకు పట్టాలిస్తే పక్కా గృహాలు నిర్మించుకొంటామని స్థానిక గిరిజనులు తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు గ్రీవెన్స్ డేలో సోమవారం ఆమెకు వినతిపత్రం సమర్పించి తమ గోడును విన్నవించుకొన్నారు. టపాతోపులోని రైల్వే ట్రాక్ పక్కన 1993లో గిరిజనులకు నివేశన స్థలాలు కేటాయించడంతో పాకలు వేసుకొని నివాసముంటున్నామన్నారు. ఆ స్థలాలకు శాశ్వత పట్టాలేవీ లేనందున పక్కా గృహ నిర్మాణాలకు దూరమై పాకల్లోని మగ్గుతున్నామన్నారు. మాపై దయ ఉంచి మేము నివాసముండే చోట పట్టాలిప్పిస్తే పక్కా గృహాలు నిర్మించుకొంటామని వివరించారు. దీనిపై తహసీల్దార్ సమాధానమిస్తూ గిరిజనులు నివాసముంటున్న స్థలం రీసర్వే ముందు వరకు ఓ రైతుకు చెందిన పట్టా భూమిగా నమోదై ఉందన్నారు. రీసర్వేలో ఆ స్థలాన్ని గ్రామ కంఠంగా చూపుతోందన్నారు. నిబంధనల ప్రకారం ఆ భూమిలో పట్టాలిచ్చే అవకాశం లేనందున మరో చోట పరిశీలించి పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయడం ద్వారా పక్కా గృహ నిర్మాణాలు చేసుకొనేలా చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు.

ప్రసన్నను కలిసిన గాదెలదిన్నె యువత



ప్రసన్నకు పూలమొక్కను అందజేస్తున్న గాదెలదిన్నె యువత

విడవలూరు: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని, కోవూరు యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డిని విడవలూరు మండలం గాదెలదిన్నె గ్రామానికి చెందిన పార్టీ నాయకులు, యువత సోమవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక యువత కిశోర్, చెంచయ్య, గిరి, నాగార్జున, రాము, మణి, లోకేష్, సుధీర్, హరికృష్ణతో పాటు పలువురు ప్రసన్నకు పూలమొక్కను అందజేశారు. అనంతరం మండలంలో రాజకీయ పరిణామాలపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, కోవూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు అనపల్లి ఉదయ్‌భాస్కర్, మత్స్యకార విభాగం అధ్యక్షుడు బుచ్చిగారి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యం కోసం వైద్య శిబిరాలు



పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలీ

పొదలకూరు: స్వస్త్ నారి శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం కింద మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహిస్తామని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ పేర్కొన్నారు. మండలంలోని మహ్మదాపురం పీహెచ్‌సీ, తాటిపర్తి హెల్త్ సెంటర్‌ను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో మహిళల ఆరోగ్య కోసం ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ముందుగా వైద్యాధికారులు, సిబ్బంది గ్రామ సర్పంచ్, అంగన్‌వాడీ టీచర్లు, పొదుపు సంఘాల సభ్యులకు కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని వివరిస్తూ అవగాహన కల్పించాల్సిందిగా సూచించారు. షెడ్యూల్ ప్రకారం ముందుగా ఎక్కడ శిబిరాన్ని నిర్వహించాలో గుర్తించాల్సిందిగా తెలిపారు. గర్భిణులు, కౌమార దశ బాలికలు, వ్యాధి నిరోధక టీకాలు వేయించుకునే పిల్లల తల్లులు కార్యక్రమంలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కో – ఆర్డినేటర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్



నిరసన వ్యక్తం చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

ముత్తుకూరు(పొదలకూరు): పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట డాక్యుమెంట్ రైటర్లు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2.0 సాఫ్ట్‌వేర్ వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో పెన్‌డౌన్ చేశామన్నారు. గతంలో పబ్లిక్ డేటా ఎంట్రీలో జరిగే తప్పులను సబ్ రిజిస్ట్రార్ సవరించే అధికారి ఉండేదన్నారు. ప్రస్తుతం కొత్త సాఫ్ట్‌వేర్ విధానంలో ఆ పరిస్థితి లేదన్నారు. డాక్యుమెంటేషన్‌లో పొరపాట్లు జరిగితే తిరిగి మొదటి నుంచి డాక్యుమెంటేషన్ చేయాల్సి ఉంటుందన్నారు. దీనివల్ల ఓటీపీలు సంబంధిత వ్యక్తులను పదేపదే అడగాల్సి వస్తోందని, కొన్ని సందర్భాల్లో రిజిస్ట్రేషన్ నిలిపివేయాల్సి ఉంటుందన్నారు. ఇందువల్ల క్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉంటుందన్నారు.

ఎస్ ట్యాక్స్ పేరుతో దండకాలు

- సర్వేపల్లిని నాశనం చేస్తున్న సోమిరెడ్డి
- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు నాగార్జున



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'సోమిరెడ్డి, ఆయన కుమారుడు ఎస్ ట్యాక్స్ పేరిట ఏ కంపెనీని వదలకుండా దండుకుంటున్నారు. రూ.కోట్లు గడిస్తూ సర్వేపల్లిని సోమిరెడ్డి సర్వనాశనం చేస్తున్నాడు' అని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున విమర్శించారు. నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. తమ నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సర్వేపల్లిలో జరుగుతున్న అన్యాయాలు, దుర్మార్గాలను ప్రశ్నిస్తే, సమాధానం చెప్పలేక సోమిరెడ్డి, ఆయన పెయిడ్ ఆర్టిస్టులు అయోమయ పరిస్థితులు సృష్టిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న దుర్మార్గాలు, దౌర్జన్యాలను కాకాణి ప్రజలకు వివరిస్తూ, పోరాటం చేస్తున్నారన్నారు. సోమిరెడ్డి అవినీతి సంపాదనకు కాకాణి అడ్డొస్తున్నారని అక్రమ కేసులు పెట్టి, 86 రోజులు జైలులో ఉంచారని, ఎప్పటికైనా న్యాయం గెలుస్తుందన్నారు. ఐదు సార్లు ఓడిపోయి, రాజకీయాలు చాలించుకునే సమయంలో గలివాటంగా గెలిచినవాడు సోమిరెడ్డి అని అన్నారు. నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడి చేస్తే, ఖండించని స్వార్థపరుడు సోమిరెడ్డి అని, ఆయన గెలిచిన రోజు నుంచి ప్రజల గురించి ఆలోచన చేయకుండా, అక్రమ సంపాదనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాడన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో కనీసం టీ షాపు పెట్టాలన్నా సోమిరెడ్డికి, ఆయన కుమారుడికి ఎస్ ట్యాక్స్ కట్టే పరిస్థితులు ఉన్నాయన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపినంత మాత్రాన కాకాణిని ప్రజల నుంచి విడదీయలేరన్నారు. సోమిరెడ్డికి నీతి, నిజాయితీ ఉంటే, గ్రావెల్‌పై కాకాణి అడిగిన అనుమతులు చూపించాలన్నారు. అలాగే గ్రావెల్ తవ్వకాలపై సీబీఐ విచారణ వేయించాలన్నారు. కొందరు టీడీపీ నేతలు సోమిరెడ్డి అధికారానికి పావులుగా మారుతున్నారన్నారు. అతని మాటలు విని కాకాణిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. సోమిరెడ్డి అక్రమాలపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రజా పోరాటం చేస్తామని, ప్రజల ముందు వారిని దోషిగా నిలబెట్టే కార్యక్రమం చేపడతామన్నారు.

నేల ఆరోగ్యంపై అవగాహన



మాట్లాడుతున్న ఏడీఏ మారుతీదేవి

ముత్తుకూరు(పొదలకూరు): పట్టణంలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలికల గురుకుల పాఠశాలలో నేల ఆరోగ్యం, భూసార పరీక్షలపై సోమవారం వ్యవసాయ శాఖాధికారులు విద్యార్థినులకు అవగాహన కల్పించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతీదేవి మాట్లాడుతూ నేల ఆరోగ్యం, నేలలో లభించే పోషకాల గురించి వివరించారు. భూసార పరీక్షలు చేయించుకుంటే నేల స్వభావం తెలుస్తుందన్నారు. భూసార పరీక్ష కేంద్రం ఏఓ నిర్మల మాట్లాడుతూ భూసార పరీక్షల కోసం పొలంలో మట్టిని ఏవిధంగా సేకరించాలో వివరించారు. మండల వ్యవసాయాధికారిణి జ్యోత్స్న రాణి మాట్లాడుతూ యూరియాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుజాత, ఏఈఓ దేవరాజ్, ఉపాధ్యాయులు భువనేశ్వరి పాల్గొన్నారు.

బీజేపీ నేతల సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు సేవాపక్షోత్సవాల కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, కాసా శ్రీనివాసులు, సురేంద్ర, మణికంఠ, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

కొడవలూరు: మండలంలో గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొడవలూరు సచివాలయంలో మంగళవారం, రామన్నపాళెంలో బుధవారం, నార్తురాజుపాళెంలో గురువారం ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఉంటాయన్నారు. అదేవిధంగా 19న తలమంచి, 20న యల్లాయపాళెంలో గిరిజనుల కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

మనుబోలు: మనుబోలు మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జలజాక్షి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభంకానున్న ఈ సమావేశంలో మండలంలో నెలకొన్న వివిధ సమస్యలపై ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు.

మోక్షగుండం స్ఫూర్తితో ముందుకు సాగాలి



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

కొడవలూరు: భారతరత్న డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో ఇంజినీరింగ్ విద్యార్థులు ముందుకు సాగాలని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ సూచించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని నార్తురాజుపాళెంలోని కళాశాలలో ఇంజినీర్స్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, ఐదు రోజుల సీ డాక్ డ్రోన్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశాభివృద్ధి ఇంజినీరింగ్ విద్యార్థులపైనే ఉందన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు ఎంచుకొన్న విభాగంలో ప్రతిభ కనబరిచి ఆశించిన లక్ష్యాలను చేరుకుని సమాజ శ్రేయస్సుకు దోహదపడాలని కోరారు. అనంతరం ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసకుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ఏపీఓ ఫణికుమార్, ఏఓ కె.గిరీష్‌కుమార్, ఎన్‌సీసీ కేర్ టేకర్ సతీష్, పీడీ బాలు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

విశ్వనాథునికి రుద్రాభిషేకం



ప్రత్యేకాలంకరణలో విశ్వనాథుడు

మనుబోలు: మండలంలోని చెర్లోపల్లి రైల్వే గేటు సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకుడు శ్రీనివాసులు విశ్వనాథస్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. ఉభయకర్తగా కల్యాణ్ వ్యవహరించారు.

బుచ్చిలో ఆక్రమణల తొలగింపు



ముంబై రహదారిపై జేసీబీ సాయంతో జరుగుతున్న ఆక్రమణల తొలగింపు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని ముంబై రహదారిపై ఇరువైపులా ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో సోమవారం మొదలైంది. రహదారికి ఇరువైపులా గతంలోనే మురుగునీరు వెళ్లేందుకు ప్రధాన కాలువలు ఏర్పాటు చేశారు. అయితే అనేక సంవత్సరాలుగా వీటిపై వ్యాపార సముదాయాలు ఏర్పడి ఎవరికివారు కాలువలను కప్పివేశారు. దీంతో పూడిక తీసేందుకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. కాలువల్లో పూడిక తీయాలంటే ముందు ఆక్రమణలు తొలగించక తప్పని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఆక్రమణల తొలగింపు, కాలువల్లో పూడిక పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ బాలకృష్ణ, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మాట్లాడుతూ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కాలువలపై ఉన్న నిర్మాణాలను మాత్రమే తొలగించి పూడిక తీస్తామని వివరించారు. గతంలో మార్కింగ్ ఇంటి లోపల వరకు వేసి ఉన్నా అంతవరకు తొలగించమని, ప్రజలకు అసౌకర్యం లేకుండా కాలువలపై ఉన్న ఆక్రమణలు మాత్రమే తొలగించి, సర్వీసు రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి మళ్లీ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన చేస్తున్న విద్యుత్ సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు దామరమడుగు సెక్షన్ కార్యాలయంలో సోమవారం రెగ్యులర్, కాంట్రాక్ట్ సిబ్బంది నలుపు రంగు బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకుడు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలు వెంటనే చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మిక వ్యవస్థను రద్దు చేసి, విద్యుత్ సంస్థలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్త నిరసనలు చేస్తామని తెలిపారు.

నిలకడగా నిమ్మ ధరలు

- దసరాకు పెరిగే అవకాశం



మార్కెట్‌కు వచ్చిన నిమ్మకాయలు

పొదలకూరు: నిమ్మ ధరల్లో కొద్దిరోజులుగా మార్పు లేదు. ఎగుమతులు తగ్గుముఖం పట్టినా ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.25 నుంచి రూ.40 వరకు ధర ఉంది. ఇవి సుమారు నెలరోజులుగా అలాగే ఉన్నాయి. దసరాకు ధరలు పెరిగే అవకాశం ఉంటుందని వ్యాపారులు వెల్లడిస్తున్నారు. లూజు (బస్తా) లెక్కన చూస్తే టాప్ రూ.3 వేల వరకు పలుకుతున్నాయి. అయితే కాయల నాణ్యత బట్టి వ్యాపారులు ధరలు నిర్ణయిస్తుంటారు. నిమ్మమార్కెట్ యార్డులో రూ.2 వేల వరకు టాప్ ధరలు పలుకుతున్నట్టు రైతులు వెల్లడించారు. ఈ ఏడాది నిమ్మకు సక్రమంగా ధరలు లభించకపోవడంతో రైతులు డీలా పడ్డారు. ఇకపై ధరలు పెరుగుతాయన్న నమ్మకం కూడా లేకుండా పోయింది. చలికాలం మొదలైతే జనవరి సంక్రాంతి తర్వాత వరకు నిమ్మ ధరలు పెరిగే పరిస్థితి ఉండదు.

న్యాయం చేయాలని వినతి



భూమి వద్ద జంగం ప్రసాద్

వెంకటాచలం: భూమిని సాగు చేయనీకుండా అడ్డుకుంటున్నారని, విచారణ జరిపి న్యాయం చేయాలని మండలంలోని తాటిపర్తిపాళెం గ్రామానికి చెందిన జంగం ప్రసాద్ కోరారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి బిట్ – 2 రెవెన్యూ పరిధిలోని 2430 సర్వే నంబర్‌లో 2.08 ఎకరాల ప్రభుత్వ భూమిని 30 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్నట్లు చెప్పారు. సర్వేపల్లి బిట్ – 2 రెవెన్యూ పరిధిలో 30 మంది రైతులు 100 ఎకరాలకు పైగా సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ ఏడాది తన భూమిలో సాగు చేయనీకుండా టీడీపీ నాయకుడు నిక్కుదల రమేష్ అధికారులపై ఒత్తిడి చేసి అడ్డుకున్నారని వినతిలో పేర్కొన్నారు. రమేష్ సుమారు ఏడెకరాల ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్నారని, కేవలం తన భూమిలో మాత్రమే సాగు చేయనీకుండా అడ్డుకోవడంతో తీవ్రంగా నష్టపోయానని తెలిపారు.

జెడ్పీ హైస్కూల్ విద్యార్థినుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థినులతో పీడీ తదితరులు

పొదలకూరు: పట్టణంలోని డీఎన్నార్ బాలికల జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు 69వ స్కూల్ గేమ్స్ ఎంపికల్లో ప్రతిభ చూపారు. సోమవారం నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్ విభాగాల్లో ఎంపికలు జరిగాయి. పలువురు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీడీ దేవిక వెల్లడించారు. బాక్సింగ్ అండర్ – 17 విభాగంలో ఎస్.కాత్యాయిని (42 – 44), కె.లీలా (52 – 54), పి.రూప (57 – 60), కె.జవలీ (70 – 75), నిఖిత (75 – 80), హేమలత (81+), అండర్ – 19 విభాగంలో హర్షిణి (45 కేజీలు), కె.హనీ (60 – 64), స్వప్నప్రియ (64 – 66), ఎం.ప్రసంసిని (45 – 48), రవికుమారి (54 – 57), సంజన (48 – 51), ప్రశాంతి (81+) వెయిట్ కేటగిరిల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కాకినాడలో జరిగే పోటీల్లో వీరు నెల్లూరు జిల్లా తరఫున వీరు పాల్గొంటారు. తెనాలిలో జరిగే అండర్ – 17 రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు కె.చందనప్రియ ఎంపికయ్యారు. అండర్ – 19 విభాగంలో జానకి, పావని, జయశ్రీ, స్వప్నప్రియ, జవలీ, హేమలత ఎంపికయ్యారు. విద్యార్థినులను ప్రధానోపాధ్యాయురాలు శైలజ, వ్యాయామ ఉపాధ్యాయినులు దేవిక, పార్వతీ అభినందించారు.

పాఠశాలలో చెట్ల నరికివేత



చెట్లు నరికివేసిన దృశ్యం

వెంకటాచలం: మండలంలోని కసుపూరు ప్రాథమిక పాఠశాల వద్ద చెట్ల నరికివేతపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కొన్నిరకాల మొక్కలను స్కూల్ సమీపంలో పెంచారు. చెట్లు ఏపుగా పెరిగాయి. వాటిని ఆదివారం కొందరి కూలీల చేత నరికి వేయించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు మండిపడుతున్నారు. ప్రభుత్వ నిధులు ఖర్చు చేసి పెంచిన చెట్లను గుట్టుచప్పుడు కాకుండా ఎందుకు నరికివేయాల్సి వచ్చిందని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ చెట్ల వల్ల పాఠశాలలోకి పాములు వస్తున్నాయని, రాత్రి వేళల్లో మద్యం తాగి బాటిళ్లు వేసి వెళుతున్నారని, అందువల్ల తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో చెప్పి నరికి వేయించామని చెబుతున్నారు.

కొండ్లపూడికి ప్రసన్న పరామర్శ



ఇందుకూరుపేట: వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ మేధావుల ఫోరమ్ అధ్యక్షుడు కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డికి ఇటీవల గుండె సమస్య తలెత్తడంతో స్టంట్ వేయించుకున్నారు. ప్రస్తుతం ఆయన ఇందుకూరుపేట మండలం, నిడుముసలి గ్రామంలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జొన్నవాడ దేవస్థానం చైర్మన్ మవులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్, కుడితిపాళెం సర్పంచ్ సురేష్, పార్టీ నేతలు జైరామ్, బిరదవోలు రూప్‌కుమార్‌రెడ్డి కార్యకర్తలున్నారు.